పోలీస్‌స్టేషన్ పరిధి మారేదెన్నడో..

- మాడులగులపల్లి మండలంలో పలు గ్రామాలు పాత పీఎస్ పరిధిలోనే
- ఇబ్బందుల్లో ఫిర్యాదుదారులు


మాడుగులపల్లి పోలీస్‌స్టేషన్

మాడుగులపల్లి : జిల్లాల పునర్ వ్యవస్థీకరణలో భాగంగా 2016 అక్టోబర్‌లో మాడుగులపల్లి నూతన మండలంగా ఏర్పాటైంది. ఉమ్మడి మండలం నుంచి 13గ్రామాలు, నిడమనూరు మండలం నుంచి 7 గ్రామాలు, త్రిపురారం మండలం నుంచి 3 గ్రామాలు, తిప్పర్తి మండలం నుంచి 5గ్రామాలు మొత్తం 28 గ్రామపంచాయతీలతో నూతన మాడుగులపల్లి మండలాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. రెవెన్యూ పరంగా అన్ని గ్రామాలు మాడుగులపల్లి మండలంలో విలీనం కాగా కొన్ని గ్రామాలు మాత్రం ఇప్పటికీ ఉమ్మడి వేములపల్లి, నిడమనూరు పోలీస్‌స్టేషన్‌ల పరిధిలోనే కొనసాగుతున్నాయి. దీంతో ఫిర్యాదుదారులు రెవెన్యూ పరంగా మాడుగులపల్లి, పోలీస్‌స్టేషన్ పరంగా నిడమనూరు మండలాలకు చేరుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. రెవెన్యూ పరిధిలో అన్ని గ్రామాలు పోలీస్‌స్టేషన్ పరిధిలో కూడా మాడుగులపల్లికే ఉండేలా అధికారులు చొరవ తీసుకోవాలని పలుమార్లు విన్నవించినా పట్టించుకునేవారు కరువయ్యారని పలు గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఏయే గ్రామాలు ఏయే పోలీస్‌స్టేషన్ల పరిధిలో..

మాడుగులపల్లి మండలంలోని పోరెడ్డిగూడెం, పాములపాడు, చర్లగూడెం, భీమనపల్లి, గుర్రప్పగూడెం, బొమ్మకల్ గ్రామాల ప్రజలు వేములపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో కొనసాగుతుండగా, గోపాలపురం, ధర్మాపురం, మాచినపల్లి గ్రామాలు నిడమనూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉన్నాయి. ఈ గ్రామాలు మొత్తం రెవెన్యూపరంగా మాడగులపల్లిలో ఉండగా పోలీస్‌స్టేషన్ల పరిధి మాత్రం ఉమ్మడి నిడమనూరు, వేములపల్లి పోలీస్‌స్టేషన్ల పరిధిలోనే కొనసాగుతున్నాయి. పోలీస్‌స్టేషన్ పరిధిపై కొంతమంది అవగాహన లేని వారు సమస్యలపై మాడుగులపల్లి పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయిస్తుండడంతో అక్కడికి వెళ్లిన ఫిర్యాదారులను పోలీస్ సిబ్బంది వేములపల్లి, నిడమనూరు పోలీస్‌స్టేషన్లకు పంపిస్తున్నారు. రెవెన్యూ పనులు మొత్తం మాడుగులపల్లి మండల కేంద్రంలో జరుగుతుండగా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసేందుకు ఇతర మండలాలకు వెళ్లాల్సి వస్తుందని ఫిర్యాదుదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అత్యవసర పరిస్థితుల్లో ఇబ్బందులు

మాడుగులపల్లి మండలంలోని బొమ్మకల్, పాములపాడు, చర్లగూడెం, భీమనపల్లి, గుర్రప్పగూడెం, పోరెడ్డిగూడెం గ్రామాలు వేములపల్లి నుంచి 20కిలోమీటర్ల దూరంలో ఉన్నాయి. అత్యవసర పరిస్థితుల్లో వీటిని కొన్ని గ్రామాలకు పోలీస్ సిబ్బంది చేరుకోవాలంటే సమయం పడుతుంది. డయల్ 100 నెంబర్‌కు ఫిర్యాదులు అందినప్పుడు నిర్ణీత సమయంలో చేరాలంటే ఇబ్బందులు పడుతున్నామని పోలీస్ సిబ్బంది పేర్కొంటున్నారు. ధర్మాపురం, గోపాలపురం, మాచినపల్లి గ్రామాలు సైతం నిడమనూరు పోలీస్‌స్టేషన్‌కు దూరంగా ఉండడంతో రాకపోకలకు తిప్పలు తప్పడం లేదు.

సిబ్బందిపై ఒత్తిడి కారణంగానేనా..

మాడుగులపల్లి మండలంలో 28 గ్రామాలు ఉండగా వీటిని పూర్తిస్థాయిలో అదే పోలీస్‌స్టేషన్ పరిధిలోకి తీసుకొస్తే ఉమ్మడి వేములపల్లి, నిడమనూరు స్టేషన్ల పరిధిలో గ్రామాల సంఖ్య తగ్గి కేసులు తగ్గే అవకాశం ఉంది. అదేవిధంగా అత్యధిక గ్రామాలు ఉన్న స్టేషన్ పరిధిలో కేసుల సంఖ్య పెరిగి సిబ్బందిపై ఒత్తిడి పెరిగే అవకాశం ఉందనే కారణంచేతనే పోలీసుశాఖ మాడుగులపల్లి రెవెన్యూ పరిధిలో పలు గ్రామాలను ఉమ్మడి మండలాల పోలీస్‌స్టేషన్ల పరిధిలోనే కొనసాగిస్తున్నట్లు తెలిసింది.

ఇబ్బందులు పడుతున్నాం



మా గ్రామం మాడుగులపల్లి రెవెన్యూ గ్రామ పరిధిలో ఉండగా పోలీస్‌స్టేషన్ నిడమనూరు పరిధిలో ఉంది. దీంతో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలంటే నిడమనూరుకు వెళ్లాల్సి వస్తుంది. పోలీస్‌స్టేషన్ల పరిధిపై అవగాహన లేని ప్రజలు ఫిర్యాదులు చేయడానికి మాడుగులపల్లి పోలీస్‌స్టేషన్‌కు వెళ్తూ ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల ఎమ్మెల్యే జయవీర్‌రెడ్డి ఈవిషయంపై అసెంబ్లీలో ప్రస్తావించారు. సమస్యను త్వరగా పరిష్కరిస్తారని ఆశిస్తున్నాం.

– బోద యాదయ్య, గోపాలపురం

పోలీస్‌స్టేషన్ల పరిధి మార్చాలి



మండలంలోని అన్ని రెవెన్యూ గ్రామాలు మాడుగులపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉంచాలి. పలు గ్రామాలు ఆయా మండలాల పరిధిలో ఉండడం వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఫిర్యాదుదారులు ఆయా పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదులు చేయలేకపోతున్నారు. ప్రభుత్వం పోలీస్‌స్టేషన్ల పరిధి మార్పునకు చర్యలు తీసుకోవాలి.

– బొమ్మకంటి నరసింహ, బొమ్మకల్

ఉద్యోగులకు బదిలీలు సహజం

- ఐదో అదనపు జిల్లా న్యాయమూర్తి వేణు


న్యాయమూర్తి సుమబాలను సన్మానిస్తున్న బార్ అసోసియేషన్ సభ్యులు

మిర్యాలగూడ టౌన్ : ఉద్యోగులకు బదిలీలు సహజమని, ఎక్కడ పనిచేసినా పట్టుదలతో పనిచేస్తే ప్రత్యేక గుర్తింపు ఉంటుందని ఐదో అదనపు జిల్లా న్యాయమూర్తి జి.వేణు, సీనియర్ సివిల్ జడ్జి సుజయ్‌కుమార్ అన్నారు. సోమవారం రాత్రి మిర్యాలగూడ మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జిగా పని చేస్తూ ఖమ్మం జిల్లా సత్తుపల్లి కోర్టుకు బదిలీపై వెళ్తున్న నాగ సుమబాలను బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మొదట పోస్టింగ్ మిర్యాలగూడకు వచ్చి సమర్థవంతంగా పని చేశారని, ఎక్కడ పని చేసినా మంచి పేరు తెచ్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు నేతి సత్యనారాయణ, భూపతిరెడ్డి, కోశాధికారి సాయికుమార్ యాదవ్, న్యాయవాదులు సీహెచ్ రఘురామారావు, శ్రీనివాస్‌రెడ్డి, గౌరు వెంకటేశ్వర్లు, వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్, కొంక వెంకన్న, భాస్కర్, శ్రీనివాస్, ఎల్లయ్య, లింగంపల్లి శ్రీనివాస్, గంగాభవానిలతో పాటు జూనియర్, సీనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

గెలుపు, ఓటములను సమానంగా తీసుకోవాలి


కబడ్డీ పోటీలను ప్రారంభిస్తున్న ఎస్ఐ వెంకటేశ్వర్లు

వేములపల్లి : క్రీడల్లో గెలుపు, ఓటములను క్రీడాకారులు సమానంగా తీసుకోవాలని ఎస్ఐ డి వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం మండలంలోని రావులపెంట జెడ్పీహైస్కూల్‌లో ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి కబడ్డీ పోటీలకు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించి మాట్లాడారు. క్రీడలు క్రీడాకారులకు మానసిక ఉల్లాసం శారీరక దారుఢ్యాన్ని అలవరుస్తాయని ఎస్ఐ డి.వెంకటేశ్వర్లు అన్నారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ మంచి స్నేహాన్ని అలవరుచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు దొంతిరెడ్డి వెంకట్‌రెడ్డి, మర్రి ఎలియాస్, మాజీ ఎంపీటీసీ శ్రీరాంరెడ్డి, నాయకులు సైదులు, పెదనాగిరెడ్డి, సతీష్‌రెడ్డి పాల్గొన్నారు.

కుక్కల బెడదను నియంత్రించాలని వినతి


మున్సిపల్ కమిషనర్ యూసుఫ్‌కు వినతి పత్రం అందజేస్తున్న కాలనీవాసులు

మిర్యాలగూడ టౌన్ : మున్సిపాలిటీలోని సీతారాంపురంలో కుక్కల బెడదను నియంత్రించాలని కోరుతూ ఆ కాలనీ వాసులు సోమవారం మున్సిపల్ కమిషనర్ మహ్మద్ యూసుఫ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు కాలనీ వాసులు మాట్లాడుతూ పట్టణంలోని 28, 43వార్డుల పరిధిలో కుక్కలు విపరీతంగా ఉన్నాయని, నిత్యం రద్దీగా ఉండే ఈ కాలనీలో పిల్లలు, పెద్దల వెంట వెంబడిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాత్రి వేళల్లో ఈ కాలనీలకు రావాలంటేనే భయమేస్తుందన్నారు. ఈ కాలనీల్లో అనేక మందిపై దాడి చేశాయని, ఈ విషయంపై అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండా పోయిందన్నారు. రోజు రోజుకు పెరిగిపోతున్న వీధి కుక్కలను నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో ఆయా కాలనీ నాయకులు మగ్దూం పాష, ఖాదర్ అయ్యూబ్, కాలనీవాసులు మార్కస్, పాష, షకీల్, షఫీ, యూనిస్, మొయిజ్, సాధిక్, నయీమ్, అలీ పాల్గొన్నారు.

కనీవిని రీతిలో రజతోత్సవ సభ

- ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కోటిరెడ్డి

హాలియా : హన్మకొండ జిల్లాలోని ఎల్కతుర్తిలో ఆదివారం కనివిని ఎరుగని రీతిలో రజతోత్సవ సభ జరిగిందని స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి అన్నారు. సోమవారం హాలియా పట్టణం కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభను విజయవంతం చేసిన పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. సాగర్ నియోజకవర్గంలో నుంచి పెద్ద ఎత్తున ఆ సభకు తరలివచ్చారని పేర్కొన్నారు. ఆయన వెంట మాజీ మార్కెట్ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, మాజీ ఎంపీపీ పెద్దిరాజు యాదవ్, బీఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు సతీష్‌రెడ్డి, వెంకటేశ్వర్లు తిరుమలగిరి(సాగర్) మండల మాజీ బీఆర్ఎస్ అధ్యక్షుడు బీవీ రమణ రాజు, ముస్లిం మైనార్టీ నాయకులు అబ్దుల్ హలీం, అంజాద్ ఖాన్, రావులపాటి ఎల్లయ్య, జలీల్‌పాషా, బండి రమేష్, మద్దిమడుగు మార్క్ తదితరులు ఉన్నారు.

వైభవంగా గంగమ్మ జాతర

త్రిపురారం : మండలంలోని బాబుసాయిపేట గ్రామంలో యాదవులు నూతనంగా నిర్మించిన గంగమ్మ దేవాలయంలో ద్వితీయ వార్షికోత్సవాలను సోమవారం అంగరంగవైభవంగా నిర్వహించారు. యాదవ కులస్తులు ప్రత్యేకంగా నిర్వహించే ఈ జాతరలో ఆచార వ్యవహారాల ప్రకారం గంగమ్మ జాతరను జరుపుకున్నారు. ఆలయంలో ముందుగా గణపతి పూజ, పుణ్యాహవచనం, పంచామృత అభిషేకాలు నిర్వహించారు. గ్రామంలోని మహిళలందరూ కొత్త కుండలలో వండిన భోనాలతో ఆలయం వద్దకు తెచ్చి గంగమ్మ తల్లికి నైవేద్యంగా సమర్పించారు. ప్రత్యేకంగా అలంకరించిన గంపలతో ఆలయం చుట్టూ ప్రదక్షణలు చేస్తు మొక్కులు చెల్లించుకుంటు గంప పండుగను నిర్వహించారు. ఈ కార్యక్రమంలోయాదవ కులస్తులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.


జాతరలో పాల్గొన్న భక్తులు

అభివృద్ధి, సంక్షేమ పథకాలపై విస్తృత ప్రచారం


అభివృద్ధి సంబరాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కాంగ్రెస్ నాయకులు

మిర్యాలగూడ : కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి సంక్షేమ, పథకాలపై ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు మే 4న పట్టణంలోని ఎన్ఎస్పీ క్యాంపులో అభివృద్ధి సంబరాలు నిర్వహించనున్నట్లు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కాకునూరి బసవయ్యగౌడ్ తెలిపారు. సోమవారం పట్టణంలో ఆయన అభివృద్ధి సంబరాల పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 16నెలల్లోనే అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిందన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, గ్యాస్ సిలిండర్‌పై రూ.500 సబ్సిడీ, 200యూనిట్ల లోపు ఉచిత కరెంట్, రూ.10లక్షల వరకు ఆరోగ్య శ్రీ ద్వారా ఉచిత వైద్యం అందిస్తున్నట్లు తెలిపారు. రైతులకు రూ.2లక్షల రుణమాఫీ, కొత్త రేషన్‌కార్డుల పంపిణీ, పేదలకు సన్న బియ్యం వంటి పథకాలను అందించడంతోపాటు త్వరలో పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు అందిస్తున్నట్లు తెలిపారు. అభివృద్ధి సంక్షేమ పథకాలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు సంబరాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రముఖ గాయని మంగ్లీ, ఇతర ఆర్టిస్టుల ఆధ్వర్యంలో సాంస్కృతి కార్యక్రమాలు నిర్వహించి ప్రజల్లో విస్తృత ప్రచారం చేయనున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గుండు నరేందర్, షేక్ జిందా, శంకర్‌రెడ్డి, ఆవుల దేవేందర్‌రెడ్డి, దండ ప్రభాకర్‌రెడ్డి, శంకర్‌నాయక్, పోలగాని వెంకటేష్, మచ్చ వెంకన్న, వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు, అధ్యాపకులు

మిర్యాలగూడ : పట్టణంలోని నాగార్జున కళాశాలలో 1994–96 బ్యాచ్‌కు చెందిన ఇంటర్మీడియట్ హెచ్ఈసీ గ్రూప్ పూర్వ విద్యార్థులు సోమవారం కళాశాలలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆనందంగా గడిపారు. కళాశాలలో తాము గడిపిన మదురు స్మృతులను ఒకరినకొరు పంచుకున్నారు. ఈ సందర్భంగా నాటి అధ్యాపకులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మధుసూదన్‌రెడ్డి, అధ్యాపకులు ప్రతాప్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, నరసింహారావు, విద్యార్థులు దుర్గారెడ్డి, సైదా, వినోద, సరిత తదితరులు పాల్గొన్నారు.

అమరవీరుల స్ఫూర్తితో మేడే ఉత్సవాలు

చింతపల్లి : కార్మికుల దినోత్సవాన్ని (మేడే) అమరవీరుల స్ఫూర్తితో జరుపుకోవాలని ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి నూనె వెంకటేశ్వర్లు కార్మికులకు పిలుపునిచ్చారు. సోమవారం మండల కేంద్రంలో మేడే వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ మండల కోశాధికారి, ఎండీ జావిద్, ఏఐఎస్ఎఫ్ డివిజన్ కార్యనిర్వాక కార్యదర్శి, షేక్. శంషోద్దీన్, సిద్దే వెంకటయ్య, కృష్ణయ్య, హరికృష్ణ, యాదయ్య, వెంకటయ్య, ఆది మల్ల యాదయ్య, ఆడెపు రాములు, లింగమయ్య తదితరులు పాల్గొన్నారు.

మే డే ఉత్సవాలను జయప్రదం చేయాలి

నాగార్జునసాగర్ : మేడే ఉత్సవాలను జయప్రదం చేయాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుమ్మల వీరారెడ్డి కోరారు. సోమవారం నందికొండలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నో త్యాగాలు చేసి సాధించుకున్న కార్మికుల హక్కులను ప్రభుత్వాలు కూలరాస్తున్నాయని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం 44కార్మిక చట్టాలను నాలుగు కోడులుగా మార్చారన్నారు. బీజేపీ ప్రభుత్వం కార్మిక చట్టాల సవరణకు పూనుకుంటుందన్నారు. పెట్టుబడులకు అనుకూలంగా కార్మిక చట్టాలను మార్చివేసే ప్రయత్నం కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఆవుతా సైదయ్య, నాయకులు షేక్ బషీర్, నాగార్జున, గోవిందరాజు, రోశయ్య తదితరులు పాల్గొన్నారు.

పహల్గాం అమరులకు నివాళి


నివాళులర్పిస్తున్న జనమైత్రి ఫౌండేషన్ సభ్యులు, యోగా సభ్యుల బృందం

మిర్యాలగూడ అర్బన్ : కశ్మీర్ లో జరిగిన పహల్గాం ఉగ్రదాడికి నిరసనగా జనమైత్రి ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలోని రామచంద్రగూడంలో గల పతంజలి నిత్య యోగ సభ్యులతో కలిసి కొవ్వొత్తులతో మృతులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎండీ. మునీర్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు అహ్మద్, తాజ్‌బాబా, అమీర్‌అలీ, హుస్సేన్, శ్రీనివాస్, ప్రవీణ్, యాదగిరి, సందీప్, జాకీర్, సైదులు, నాగేందర్, సుజాత, జ్యోతి, రమ, అలివేలు, కుమారి, వరలక్ష్మి, స్వేత పాల్గొన్నారు.

నిడమనూరు : పహల్గాం ఉగ్రదాడిలో మృతిచెందిన వారికి నివాళులర్పిస్తూ విద్యార్థులు నిడమనూరు ప్రధాన రహదారిపై కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. పాక్ దుశ్చర్యలపై నిరసన వ్యక్తం చేశారు. హాలియా టైం పాఠశాలకు చెందిన విద్యార్థులు కొవ్వొత్తుల ర్యాలీతోపాటు పచ్చదనం, ప్లాస్టిక్ వాడకం, సెల్ ఫోన్ వినియోగంతో కలిగే నష్టాలను వివరిస్తూ ప్రదర్శన రూపంలో స్థానికులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో నిడమనూరు ఎస్ఐ ఉప్పు సురేష్, ఏఎస్ఐ రమేష్, టైం పాఠశాల డైరెక్టర్స్ మందా నరేందర్ రెడ్డి, కత్తి కోటి రెడ్డి, ఉపాధ్యాయులు శ్రీధర్ రెడ్డి, రమేష్ రెడ్డి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నీళ్లు లేక ఎండుతున్న మొక్కలు


డివైడర్‌పై ఎండిపోతున్న మొక్కలు

కొండమల్లేపల్లి : అసలే వేసవి కాలం మనుషులే ఎండకు తల్లడిల్లుతున్న తరుణంలో నోరులేని మొక్కల పరిస్థితి వర్ణనాతీతం. కొండమల్లేపల్లి పట్టణ కేంద్రంలోని దేవరకొండ రోడ్డులో డివైడర్ల మధ్యన ఉన్న మొక్కలు నీళ్లు లేక ఎండిపోతున్నాయి. స్పందించి వేసవి కాలంలో మొక్కలకు నీరు అందించాలని పేర్కొంటున్నారు.

ప్రమాదకరంగా మూలమలుపులు


బాలాజీనగర్‌కు వెళ్లే రోడ్డు మార్గంలో ప్రమాదకరంగా మూలమలుపు


దుగ్యాలకు వెళ్లే రోడ్డు మార్గంలో..

పెద్దఅడిశర్లపల్లి : పీఏపల్లి మండలంలోని పలు మూలమలుపులు ప్రమాదకరంగా మారాయి. హైదరాబాద్–నాగార్జునసాగర్ రాష్ట్ర రహదారిని ఆనుకొని ఉన్న మండలంలోని పలు గ్రామాలకు వెళ్లే రహదారులు మూలమలుపులు ప్రమాదాలకు నిలయాలుగా మారాయి. మూలమలుపుల వద్ద సూచిక బోర్డులు లేకపోవడంతో పాటు రోడ్డుకు చెట్లు ఏపుగా పెరగడంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. మండలంలోని బాలాజీనగర్, దుగ్యాల, మల్లాపురం, వద్దిపట్ల, ఎర్రగుంటతండా, కేశంనేనిపల్లి, అజ్మాపురం, ఘనపురం, పెద్దగట్టు, పావురాలగట్టు, తిరుమలగిరి, అంగడిపేట, రంగారెడ్డిగూడెంలకు వెళ్లే రహదారుల్లో మూలమలుపులు అధికంగా ఉండడంతో ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయి. ప్రమాదాలు చోటు చేసుకొని ప్రాణాలు పోతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైన సంబంధిత అధికారులు స్పందించి సూచిక బోర్డులు ఏర్పాటు చేయడంతో పాటు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.


మల్లాపురం గ్రామానికి వెళ్లే రోడ్డు మార్గంలో


కేశంనేనిపల్లి గ్రామానికి వెళ్లే మార్గంలో ఇలా..

ఏటా నాలుగు సార్లు ఓటరు నమోదు

- ఎన్నికల సంఘం ఆదేశాలతో ప్రక్రియ షురూ
- జనవరి, ఏప్రిల్, జూలై, అక్టోబర్ నెలల్లో దరఖాస్తులకు అవకాశం



దేవరకొండ : కొత్త ఓటర్ల నమోదుకు కేంద్ర ఎన్నికల సంఘం అవకాశం కల్పించింది. ప్రతి సంవత్సరం నాలుగు సార్లు కొత్తగా ఓటు హక్కు నమోదు చేసుకునేందుకు ఎన్నికల సంఘం వెసులుబాటు కల్పించింది. దీంతో ఏప్రిల్ 1వ తేదీ నుండి 18ఏళ్లు నిండిన వారు కొత్తగా తమ ఓటును నమోదు చేసుకునేందుకు దరఖాస్తు చేసుకోవాలని ఆదేశాలిచ్చింది. ఇప్పటికే ఆన్‌లైన్‌లో దరఖాస్తు ప్రక్రియ కొనసాగుతుండగా... ఏప్రిల్‌లో కొత్త ఓటరు నమోదుకు కావాల్సిన ఏర్పాట్లను అధికార యంత్రంగా పూర్తి చేస్తుంది.

ప్రతి మూడు నెలకొకసారి..

గతంలో 18ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు కావాలంటే ప్రతి సంవత్సరం జనవరి 1వ తేది నాటికి 18ఏళ్లు నిండి ఉండాలి. అప్పుడు మాత్రమే కొత్తగా ఓటు నమోదు చేసుకునేందుకు అవకాశం కల్పించేవారు. ఈ ఏడాది నుంచి ప్రతి ఏటా నాలుగు సార్లు అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకునేందుకు ఎన్నికల సంఘం అవకాశం కల్పించింది. ఇందులో భాగంగా జనవరి, ఏప్రిల్, జూలై, అక్టోబర్ నెలల్లో ఓటు హక్కు పొందేందుకు అవకాశం కల్పించనుంది

ఓటు నమోదు ఇలా..

కొత్త ఓటర్ల నమోదు నేపథ్యంలో 18ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ బూత్‌స్థాయి అధికారి ద్వారా గానీ లేకపోతే ఆన్‌లైన్‌లో గానీ దరఖాస్తు చేసుకోవచ్చు. కొత్త ఓటరు నమోదు కోసం ఫారం–6, అభ్యంతరాలు, తొలగింపుకు ఫారం–7, దిద్దుబాట్లు, సవరణలు, చిరునామా మార్పునకు ఫారం–8 ద్వారా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది.

ఓటరుగా నమోదు చేసుకోవాలి



కొత్తగా ఓటు నమోదు చేసుకునేందుకు కేంద్ర ఎన్నికల సంఘం కల్పించిన అవకాశాన్ని అర్హులు సద్వినియోగం చేసుకోవాలి. 2025 ఏప్రిల్ 1వ తేది నాటికి 18ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును నమోదుచేసుకోవాలి.ప్రతి ఏటా నాలుగు సార్లు అర్హులు ఓటరుగా నమోదు అయ్యేందుకు కల్పించిన అవకాశం సద్వినియోగపర్చుకోవాలి. అర్హులు ఎవరైనా తమ ఓటును ఆన్‌లైన్‌లో సైతం నమోదు చేసుకోవచ్చు.

రమణారెడ్డి, ఆర్డీఓ, దేవరకొండ

క్లుప్తంగా

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ


చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

మిర్యాలగూడ : పట్టణంలోని బాపూజీనగర్‌కు చెందిన బాధితులకు మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను సోమవారం ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి తన కార్యాలయంలో పంపిణీ చేశారు. యాతం లింగరాజుకు రూ.60వేలు, వెలగపూడి సునందకు రూ.60వేలు, పూల కొండమ్మకు రూ.50వేలు, పాగా శ్రీనివాస్‌కు రూ.27వేలు, మాతంగి మంగమ్మకు రూ.20వేలు, మన్నెం రాధికకు రూ.60వేల చెక్కులు మంజూరయ్యాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పంపిణీ చేసి మాట్లాడుతూ పేదలు ఆపద సమయంలో సీఎం సహాయ నిదిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు వేణుగోపాల్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్లు నాగలక్ష్మీ, ప్రసాద్, నాయకులు పండుగ శ్రీను, మన్యం శ్రీనివాసరావు, గాడిపర్తి ఏడుకొండలు, అంజియాదవ్, కొనకంచి వీరరాఘవులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

మిర్యాలగూడ టౌన్ : అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్న సంఘటన సోమవారం మండలంలో చోటు చేసుకుంది. మిర్యాలగూడ రూరల్ ఎస్ఐ మల్లికంటి లక్ష్మయ్య తెలిపిన వివరాల ప్రకారం.. మిర్యాలగూడ మండలం తక్కెళ్లపాడు నుంచి తడకమళ్ల వైపు వెళ్తున్న ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ డ్రైవర్ వేములపల్లి మండలం కామేపల్లి గ్రామానికి చెందిన కంభంపాటి తిరుపతయ్యపై ఈ మేరకు కేసు నమోదు చేయడంతో పాటు ట్రాక్టర్‌ను సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

వసతులు ఏర్పాటు చేయాలి

డిండి : ధాన్యం కొనుగోలుకేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా వసతులు ఏర్పాటు చేయాలని సీపీఐ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఎండీ.మైనోద్దిన్ సోమవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రాలకు తీసుక వచ్చిన వరి ధాన్యాన్ని తేమ రాగానే కొనుగోలు చేయడంలో నిర్లక్ష్యం చేస్తే ప్రస్తుతం కురుస్తున్న అకాల వర్షాలకు ధాన్యం తడిసి రైతు నష్ట పోతాడని ఆయన పేర్కొన్నాడు.

విద్యుదాఘాతంతో గేదె మృతి

త్రిపురారం : ప్రమాదవశాత్తు విద్యుదాఘాతంతో గేదె మృతిచెందింది. ఈ సంఘటన త్రిపురారం మండలంలోని బెజ్జికల్ గ్రామ శివారులో సోమవారం చోటు చేసుకుంది. బాధిత రైతు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన రైతు అనుముల రఘుపతి రెడ్డి వ్యవసాయంతో పాటుగా గేదెలను సాకుతున్నారు. గ్రామంలో వరి కొతలు కోయడంతో రోజు మాదిరిగానే గేదెలను మేత కోసం సమీపంలో ఉన్న పొలాలకు తోలుకెళ్లారు. గేదెలు మేత మేసుకుంటూ వ్యవసాయ పొలాలకు ఏర్పాటు చేసుకున్న విద్యుత్ స్తంభం వైపు వెళ్లింది. అప్పటికే విద్యుత్ మోటార్‌కు ఏర్పాటు చేసుకున్న కరెంటు తీగ తెగి ఉండడంతో విధ్యుత్ సరఫరా అవుతుండడంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే గేదె మృతి చెందినట్లు తెలిపారు. గేదె మృతి చెందిన ప్రాంతాన్ని త్రిపురారం మండల పశు వైద్యాధికారి డాక్టర్ నాగేందర్ పంచనామా నిర్వహించారు. గేదె విలువ సుమారు రూ. 85 వేలు ఉంటుందని ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతు వేడుకున్నాడు.

ఎస్ఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శిగా శంకర్



నల్లగొండ టౌన్: ఎస్ఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శిగా ఖమ్మంపాటి శంకర్ ఎన్నికయ్యారు. ఇటీవల ఖమ్మంలో నిర్వహించిన ఎస్ఎఫ్ఐ తెలంగాణ రాష్ట్ర మహాసభల్లో తనను రాష్ట్ర సహాయ కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు శంకర్ సోమవారం నల్లగొండలో తెలిపారు.